మద్ది ఆలయాన్ని సందర్శించిన హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయాన్ని హైకోర్టు జడ్జి వి.గోపాలకృష్ణారావు సందర్శించారు. ఆదివారం ఆలయానికి వచ్చిన హైకోర్టు జడ్జి వి.గోపాలకృష్ణారావు దంపతులను ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయ సందర్శనం అనంతరం ఆలయ ముఖ మండపంలో జడ్జి గోపాలకృష్ణారావుకు వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ న్యాయమూర్తి గోపాలకృష్ణారావును శేషవస్త్రంతో సత్కరించి ఆంజనేయస్వామి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.కిషోర్‌కుమార్, జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.రాజరాజేశ్వరి, ఆర్‌డిఒ ఎం.ఝాన్సీరాణి, తహశీల్దార్ స్లీవజోజి పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాలో 'పోరుకేక'..!

పోలవరం నిర్వాసితుల సమస్యలే ప్రధాన ఎజెండాగా సిపిఎం పాదయాత్ర

వేలేరుపాడు మండలం రుద్రంకోటలో ప్రారంభ సభ

పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో యాత్ర

ఆరు మండలాలు, 25 గ్రామాల మీదుగా పాదయాత్ర

తొలిరోజు సభలో పాల్గొనున్న ఎంసిపిఐయు నాయకులు నాగభూషణం

జులై ఒకటో తేదీన ఏలూరు నుంచి విజయవాడకు పయనం

అల్లూరి జిల్లాలో సాగుతున్న యాత్ర(ఫైల్)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సాగుతున్న 'పోలవరం పోరుకేక' పాదయాత్ర ఈనెల 26వ తేదీన ఏలూరు జిల్లాలోకి ప్రవేశించనుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం గ్రామంలో సోమవారం మధ్యాహ్నానికి యాత్ర ముగించుకుని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం రుద్రంకోట గ్రామంలోకి యాత్ర ప్రవేశించనుంది. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభ సభ జరగనుంది. సభలో ముఖ్యవక్తగా ఎంసిపిఐయు నాయకులు నాగభూషణం పాల్గొనున్నారు ఈనెల 26వ తేదీ నుంచి జులై ఒకటోతేదీ వరకూ పాదయాత్ర జిల్లాలో సాగనుంది. మొత్తం ఐదున్నర రోజులపాటు వేలేరుపాడు, కుక్కునూరు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం, పోలవరం మీదుగా మొత్తం ఆరుమండలాలు, 25 గ్రామాల మీదుగా యాత్ర సాగనుంది. ఆరుచోట్ల బహిరంగ సభలు, 14 చోట్ల సభలు జరగనున్నాయి. ప్రధానయాత్రకు అనుబంధంగా పోలవరం మండలం నుంచి ఉపయాత్ర జరగనుంది. సిపిఎం నాయకులు కె.శ్రీనివాస్, గుడెల్లి వెంకట్రావు, తామా ముత్యాలమ్మ ఆధ్వర్యంలో 28, 29 తేదీల్లో రెండురోజుల పాటు 51 కిలోమీటర్ల మేర నడవనుంది. ప్రధాన యాత్ర బృందంతో ఈ ఉపయాత్ర 29వ తేదీన బుట్టాయగూడెంలో కలవనుంది. పాయాత్రలో వేలాది మంది నిర్వాసిత గిరిజనులు, సిపిఎం కార్యకర్తలు, నాయకులు పాల్గొనున్నారు. బహిరంగ సభలో రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు ప్రసంగించనున్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో ఈ పాదయాత్ర సాగుతోంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం చట్టంలో పొందుపరిచింది. పోలవరం ప్రాజెక్టుకు అయ్యే ఖర్చు మొత్తం కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపింది. తొమ్మిదేళ్లుగా కేంద్రంలోని మోడీసర్కార్ పోలవరానికి నిధులు కేటాయింకుండా నిర్లక్ష్యం చేస్తోంది. నిధులు రాబట్టడంలో గతంలో టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలు సైతం విఫలమయ్యాయి. పెరిగిన ధరల నేపథ్యంలో ప్రాజెక్టు ఖర్చు రూ.52 వేల కోట్లు అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం తేల్చింది. ఇందులో రూ.30 వేల కోట్లు నిర్వాసితులకు పరిహారం ఇచ్చేందుకు అవుతుందని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వపోవడంతో నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పోలవరం నిర్వాసితులకు భూమికి భూమి, ఇళ్లు కోల్పోతున్న వారికి ఇళ్లు, పునరావాస ప్యాకేజీ, 18 ఏళ్ళ నిండిన యుతవకు పరిహారం, పునరావాస కాలనీల్లో కనీస వసతులు వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పోలవరం నిర్వాసితులకు పరిహారమివ్వాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్టు నిర్మాణంపై శ్రద్ధ పెడుతున్నాయే తప్ప నిర్వాసితుల గురించి పట్టించుకోవడం లేదు. దీంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 41.15 కాంటూరు పరిధిలో కుక్కునూరు, వేలేరుపాడు మండలంలో 7,071 కుటుంబాలుండగా ఇప్పటి వరకూ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందుకున్న కుటుంబాలు 1,043 మాత్రమే. ఇంకా 5074 కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కూడా ఇవ్వలేదు. ఇంకా 45.72 కాంటూరు పరిధిలోని 14,703 నిర్వాసిత కుటుంబాల పరిస్థితి ఏమిటో తెలియని పరిస్థితి నెలకొంది. నిర్వాసితుల నివాసం కోసం జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లో చేపట్టిన నిర్వాసిత కాలనీలు 40 శాతం కూడా పూర్తికాలేదు. శ్మశానం, తాగునీరు, డ్రెయినేజీ, వంటి కనీస వసతులు ఇప్పటికీ పూర్తికాలేదు. 18 ఏళ్ల నిండిన యుతవకు పరిహారంపై ఆమోదయోగ్యంకాని నిబంధనలను తెరపైకి తెచ్చి తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. 2017 జూన్ నెలాఖరుకు 18 ఏళ్ళ నిండిన యువతీ, యువకులను పరిగణలోకి తీసుకుంటామని కటాఫ్ తేదీ నిర్ణయించడం దారుణం. గ్రామాలను ఖాళీచేసే సమయానికి 18 ఏళ్లు నిండిన యువతను అర్హులుగా తీసుకోవాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా, కాపర్ డ్యాం నిర్మాణం పూర్తిచేయడంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 107 గ్రామాల్లో గత ఏడాది జూలైలో వరదలకు నీటమునిగిన పరిస్థితి నెలకొంది. నెలల తరబడి నిర్వాసితులు పునరావాస కాలనీల్లోనే గడపాల్సి వచ్చింది. మళ్లీ జూలై వస్తున్నా పరిహారం మాత్రం నిర్వాసితులకు అందించలేదు. నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం ఆది నుంచి పోరాడుతూనే ఉంది. నేడు సమస్య పరిష్కారం కోసం ముంపుమండలాల్లో 'పోలవరం పోరుకేక' పాదయాత్ర చేస్తోంది. నిర్వాసితుల పట్ల ఆది నుంచి నిబద్దతో పనిచేస్తున్న సిపిఎం చేపట్టిన ఈ పాదయాత్రపై అంతటా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. పాదయాత్రలో సంఘీభావం తెలిపేందుకు రాజకీయాలకు అతీతంగా అనేకమంది మద్దతు తెలుపుతున్నారు.

జిల్లాలో యాత్ర సాగేదిలా..

యాత్ర సాగే మండలాలు -6
గ్రామాలు-25
యాత్ర సాగే రోజులు- ఐదున్నర రోజులు
కిలోమీటర్లు - 80
పోలవరం ఉపయాత్ర రోజులు - 2
పోలవరం ఉపయాత్ర కిలోమీటర్లు - 51

26.6.23న..
వేలేరుపాడు మండలం రుద్రంకోటలో ప్రారంభమై మద్దిగట్ల, వసంతవాడ గ్రామాలమీదుగా కుక్కునూరు మండలంలోకి ప్రవేశిస్తుంది. అక్కడ ఆర్వపల్లి, దాచవరంలో యాత్ర సాగుతుంది.

27వ తేదీన..
కుక్కునూరు మండలం లంకాలపల్లి, దిబ్బగూడెం గ్రామాల్లోనూ, జీలుగుమిల్లి మండలంలోని రాచన్నగూడెం, కామయ్యపాలెంలో సాగుతుంది.

28వ తేదీన..
జీలుగుమిల్లి మండలంలోని వంకావారిగూడెం, మడకం వారిగూడెం కాలనీల్లోనూ, అదేరోజు జంగారెడ్డిగూడెం మండలంలోని చల్లావారిగూడెం, జీలుగుమిల్లి మండలంలోని కొరుటూరు కాలనీల్లో యాత్ర సాగుతుంది.

29వ తేదీన..
జీలుగుమిల్లి మండలంలోని ములగలంపల్లిలో, బుట్టాయిగూడెం మండలంలోని రెడ్డిగణపవరం, పాలకుంటకాలనీలు, రామారావుపేట, బుట్టాయగూడెంలో సాగనుంది.

30వ తేదీన..
బుట్టాయగూడెం మండలంలోని మర్లగూడెంలో, జంగారెడ్డిగూడెం మండలంలోని జంగారెడ్డిగూడెం కాలనీల్లో యాత్ర సాగుతుంది.

ఒకటో తేదీన..
జిల్లా కేంద్రం ఏలూరుకు చేరుకుని అక్కడ నుంచి విజయవాడకు పయనమవుతుంది.

పోలవరం ఉపయాత్ర సాగేదిలా..

28వ, తేదీన..
పోలవరం, ఇటుకలకోట, వింజరం, కాలనీలు, కాలనీలు(గుంజవరం), దొండపూడి, కొండ్రుకోట కాలనీ

29వ తేదీన
ఎల్ఎన్‌డి పేట, కొవ్వాడ, కెఆర్‌పురం, అచ్చియ్యపాలెం, కాపవరం జంక్షన్, బుట్టాయగూడెం మీదుగా సాగుంది.

పోలవరం నిర్వాసితులకు

ఆదినుంచి అండగా సిపిఎం

అలుపెరగని పోరాటాలతోనే పరిహారం పెంపు - విజయవంతంగా సాగుతున్న 'పోరుకేక'

నిర్వాసితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన దీక్ష (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం.. ఎందరో నిర్వాసితుల త్యాగఫలితం.. కానీ నేడు వారి త్యాగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయి. ఫలితంగా వారు ఉన్న ఊళ్లను, ఇళ్లను, పొలాలను, ఉపాధిని కోల్పోయి దిక్కుతోచని స్థితిలో దయనీయ జీవనాన్ని గడుపుతున్నారు. అటు ప్రభుత్వం ఇస్తామన్న పరిహారం అందక.. చూపిస్తామన్న ఉపాధి చూపక, కల్పిస్తామన్న పునరావాసం లేక చెట్టుకొకరు, పుట్టకొకరుగా దుర్భర జీవనాన్ని అనుభవిస్తున్నారు. ఈ తరుణంలో వారికి ఆదినుండి సిపిఎం కొండంత అండగా నిలిలిచింది. వారి సమస్యలపై ఏళ్ల తరబడి పోరాడుతోంది. అనేక విజయాలనూ సాధించిపెట్టింది.

పోలవరం ప్రాజెక్టుకు 2004లో శంకుస్థాపన జరిగింది. అనంతరం 2015లో జాతీయ ప్రాజెక్టుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇదిజరిగి 18 సంవత్సరాలు గడిచినా ప్రాజెక్టు నిర్మాణం నేటికీ నత్తనడకన సాగుతుంది. కేంద్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి పూర్తిచేసే చర్యలు ఏమాత్రమూ చేపట్టడం లేదు. ముఖ్యంగా నిర్వాసితుల గోడును కనీసం పట్టించుకోవడం లేదు. 18 సంవత్సరాలుగా వారు నరకయాతన అనుభవిస్తూనే ఉన్నారు. ఈ తరుణంలో నిర్వాసితులకు అండగా నిలబడింది సిపిఎం మాత్రమే.. కుక్కునూరు మండలవ్యాప్తంగా ప్రాజెక్టు వల్ల సర్వం కోల్పోతున్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వం నుంచి వచ్చే వ్యక్తిగత ప్యాకేజీతో పాటు ఇంటి నిర్మాణానికి సంబంధించిన పరిహారం కూడా చెల్లించాలని, పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించి తరలించాలని, మండలం యూనిట్‌గా తీసుకుని పరిహారం చెల్లించాలంటూ 18 సంవత్సరాల నుంచి పోరాడుతున్న ఏకైక పార్టీ సిపిఎం.. నిర్వాసితులను చైతన్యపరుస్తూ అనేక పోరాటాలు నిర్వహిస్తుంది. ప్రతిసంవత్సరం గోదావరికి వరదలు వచ్చే సమయంలో నిర్వాసిత గ్రామాల సమస్యలను, ప్రభుత్వ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తూ సమస్యల పరిష్కారానికి పోరాడుతూ వారితో మమేకమవుతున్నారు. సిపిఎం లేకపోతే ముంపుమండలాల్లోని సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే వారు లేరనడంలో సందేహమే లేదు. తొలుత పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురయ్యే గ్రామాలకు ఎలాంటి పరిహారమూ ఇవ్వకుండా తరలించి తీరని అన్యాయం చేశారు. వైఎస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పటిలో కుక్కునూరు, వేలేరుపాడు, చింతూరు, కూనవరం, విఆర్.పురం మండలాల్లో వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.1.15 లక్షల ప్రకారం అతితక్కువ పరిహారమిచ్చారు. దీంతో సిపిఎం ఆధ్వర్యంలో అనేక రూపాల్లో ఉద్యమాలు చేసిన ఫలితమే రాష్ట్ర విభజన అనంతరం సిఎంగా చంద్రబాబు ప్రమాణం చేసిన తర్వాత భూములకు ఎకరాకు రూ.10.50 లక్షలు చొప్పున పరిహారం చెల్లించారు. ఇంకా మిగులు భూములున్నాయి. వాటికీ ఇప్పటి వరకూ ఎలాంటి చెల్లింపులూ చేయలేదు

వరదలకు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తున్న అప్పటి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు (ఫైల్)

నిర్వాసితుల సమస్యలు తెలుసుకుంటున్న వి.శ్రీనివాస్‌రావు (ఫైల్)

వరదల సమయంలో సాయం అందిస్తున్న సిపిఎం నేతలు (ఫైల్)

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ఒక్క గ్రామానికి కూడా చెల్లించలేదు. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత విలీన మండలాల్లోని కొన్ని గ్రామాల్లోని గిరిజనులకు వ్యక్తిగత ప్యాకేజీ రూ.6.36 లక్షలు మాత్రమే ఇచ్చి ఇంటి పరిహారం ఊసే మరిచారు. గిరిజనేతరులకు ఎలాంటి పరిహారమూ చెల్లించలేదు. గోదావరికి వరదలు వచ్చే సమయంలో ప్రతి గ్రామంలోనూ గ్రామసభలు నిర్వహించి పోలీస్‌శాఖతో బెదిరించి గ్రామాలను ఖాళీ చేయాలని హెచ్చరించిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

నాటి గ్రామసభల నుండి నేటి పోరుకేక వరకూ తుపాకీ తూటాలకు, అక్రమ ఆరెస్టులకూ బెదరని ఎర్రజెండా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మొదలుకొని నిర్వాసితులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని పెద్దఎత్తున పోరాటాలు చేపట్టింది. ఉమ్మడి రాష్ట్రంలోని భద్రాచలంలో 2008లో సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమంలో ఆనాటి ప్రభుత్వం అన్యాయంగా జరిపిన పోలీసు కాల్పుల్లో ఐదుగురి శరీరాల్లోకి తూటాలు దింపి, 110 మందిపై అక్రమ కేసులు పెట్టారు. 2014లో రాష్ట్ర విభజన తరువాత నిర్వాసితుల కోసం కుక్కునూరు మండలం లంకాలపల్లి వద్ద సిపిఎం ఆధ్వర్యంలో శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తే ఐదుగురిపార్టీ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి కేసులు పెట్టారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తొమ్మిదేళ్లుగా మండలంలోని వేలేరు నుండి వేలేరుపాడు మండలంలోని కోయిదా వరకూ, సీతారామ నగరం నుండి ఏలూరు కలెక్టర్ కార్యాలయం వరకూ పాదయాత్రలు, సైకిల్ యాత్రలు, మండల కేంద్రాల్లో ఎన్నోసార్లు నిరాహారదీక్షలు, ధర్నాలు, నిర సనలు, రాస్తారోకోలు చేశారు. గోదావరి వరదల సమయంలో వరద బాధితులకు నిత్యావసర వస్తువులు, బియ్యం, భోజన వసతులు కల్పించి మేము ఉన్నామంటూ భరోసా ఇచ్చింది ఎర్రజెండా నేతలే..

పోలవరం నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో ప్రస్తుతం అల్లూరి జిల్లా నెల్లిపాక నుండి రాష్ట్ర రాజధాని అమరావతి వరకూ పోలవరం పోరుకేక పేరుతో నిర్వాసితులను ఏకంచేసి పాదయాత్ర ద్వారా నిద్రపోతున్న పాలకులకు కనువిప్పు కల్గించి నిర్వాసితుల హక్కులు సాధించుకోవాలని ఎర్రజెండా పోరుబాట పట్టింది.

పోరుకేక డిమాండ్లు ఇవే..

ప్రాజెక్టు వల్ల సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, నిర్వాసితులకు పూర్తిపరిహారమిచ్చాకే ప్రాజెక్టు పనులు చేపట్టాలని, 1986, 2022, గోదావరి వరదలను ప్రామాణికంగా తీసుకుని మండలం యూనిట్‌గా పరిహారం చెల్లించాలని పోలవరం పోరుకేక డిమాండ్ చేస్తుంది. ఎన్నికలకు ముందు జగన్ ఇచ్చిన హామీ ప్రకారం గతంలో లక్షా 15 వేల రూపాయలిచ్చిన భూముల రైతులకు ఎకరాకు రూ.ఐదు లక్షలు, ప్రతినిర్వాసితుడికీ రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని, 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులకు ఇక్కడి నుండి తరలించే నాటికే కటాఫ్ తేదీగా నిర్ణయించి పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతుంది. అలాగే వసతులతో డబుల్ బెడ్‌రూము గృహాలు నిర్మించి పూర్తి పరిహారం ఇచ్చాకే నిర్వాసితులను ఇక్కడి నుండి తరలించాలని, నిర్వాసిత కలనీల్లో అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తుంది.

గోదావరి ఉప్పెనలా...

ఉత్సాహంగా పోలవరం పోరుకేక మహాపాదయాత్ర

రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల సంపూర్ణ సంఘీభావం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి, వి ఆర్ పురం, కూనవరం

పోలవరం నిర్వాసితుల పోరుబాట గోదావరి ఉప్పెనలా... ముందుకు సాగుతోంది. ఈనెల 20వ తేదీన ఎటపాక మండలం నెల్లిపాకలో సిపిఎం ఆధ్వర్యంలో పోరుకేక మహా పాదయాత్ర ప్రారంభమైన విషయం విధితమే. ఆరో రోజైన ఆదివారం వీఆర్ పురం మండలంలో సుమారు 20 కిలోమీటర్లు పాదయాత్ర నడిచింది. దీంతో మొత్తం 120 కిలోమీటర్ల మార్కును దాటి ముందుకు సాగుతోంది. గ్రామ గ్రామాన పోలవరం నిర్వాసితులను కలుపుకుంటూ వెళుతున్న ఈ యాత్ర విశేష జన మద్దతు లభిస్తోంది. జెండాలకు అతీతంగా, ఒకే అజెండాతో రాజకీయ పక్షాలు సంఘాలు ఏకమవుతున్నాయి. పాదయాత్ర ఆహ్వానించి తమ మద్దతును తెలుపుతున్నాయి. ఆదివారం ఉద్యోగ,ఉపాధ్యాయ, రైతు, గిరిజన తదితర ఎనిమిది సంఘాలు పాదయాత్రకు మద్దతు తెలిపాయి. రామవరంలో మొదలైన పాదయాత్ర అడవి వెంకన్నగూడెం, సున్నంవారిగూడెం మీదుగా రాత్రికి రేఖపల్లి చేరుకుంది. ఈ సందర్భంగా సుమారు ఆరు గ్రామాల్లో నిర్వాసితులు తమ సమస్యలను వినతిపత్రం రూపంలో పాదయాత్రకు విన్నవించారు. తమ కోసం అనేక పోరాటాలు నిర్వహించిన ఉద్యమ నేత మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య ఈ కష్టకాలంలో లేకపోవడం తీరని లోటని ఉమ్మిడివరానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు పాయం రామారావు ఓ బహిరంగ సభలో వెల్లడించటం ఆదివాసి హృదయాల్లో సున్నం రాజయ్య చెరగని ముద్ర వేశారని స్పష్టమవుతోంది. రంపచోడవరం తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి సున్నవారిగూడెంలో జరిగిన మహాసభలో పాల్గొని తన సంఘీభావం తెలిపారు. పోలవరం నిర్వాసితులు ఏకం కావలసిన అవసరాన్ని స్పష్టం చేవారు.

సమస్యలు వింటూ.. ముందుకు సాగుతూ..

పోలవరం నిర్వాసితుల సమస్యలను వింటూ పాదయాత్ర ముందుకు సాగుతోంది. సోములగూడెంలో 150 కుటుంబాలు ఉన్నాయని, 38 మీటర్లకే వరద ముంచెత్తుతున్నా ప్రభుత్వం 45వ కాంటూరులో ప్రకటించిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత వరదలకు ఇల్లు కూలిపోయిన వారికి రూ.పదివేల ఆర్థిక సహాయం కేవలం 20 శాతం మందికి ఇచ్చారని వాపోయారు. తమ గ్రామానికి తాగునీటి సౌకర్యం లేదని, సవరణది నీటిని పైప్ లైన్ ద్వారా సదుపాయం కల్పించాలని కోరిన ముంపు ప్రాంతాల్లో అభివద్ధి చేయలేమని అధికారులు చెబుతున్నారని తెలిపారు. లక్ష్మీనగరంలో 120 కుటుంబాలుండగా, ఇక్కడా 38 మీటర్లకే గ్రామం ముంపునకు గురవుతున్నా 45.72 కాంటూరులో చేర్చారని వాపోయారు. గత ఏడాది వరదల కాలంలో ఐదు కేజీల బియ్యం, నాలుగు ఉల్లిపాయలు, టమోటాలు బంగాళదుంపలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది వచ్చిన వరదలకు కూలిపోయిన ఇళ్లకు పరిహారం కేవలం 25 శాతం మందికి చెల్లించినట్లు వివరించారు. అడి వెంకన్నగూడెంలో 130 కుటుంబాలు ఉన్నాయని, 41.15 కాంటూరులో చేర్చినప్పటికీ ఎటువంటి సహాయ కార్యక్రమాలు అందలేదని తెలిపారు. నోటిఫికేషన్ ఇచ్చిన గ్రామాలలో మూడు గ్రామాలకు మాత్రమే పునరావాసం కల్పిస్తున్నారని, ఎక్కడ కోరుకుంటే అక్కడ పునరావాసం కల్పించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. సున్నంవారిగూడెంలో 64 కుటుంబాలు ఉన్నాయని గ్రామంలో ఇల్లు పాక్షికంగా మునిగినా చుట్టుపక్కల వ్యవసాయ భూములు రహదారులు పూర్తిగా మునిగిపోయాయని తెలిపారు కానీ ముంపు గ్రామంగా ప్రకటించలేదని, తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో తాగునీరు, రహదారి సమస్యలు ఉన్నాయని వివరించారు. చిన్నమట్టపల్లిలో 120 కుటుంబాలు ఉన్నాయని, గ్రామం పూర్తిగా మునిగిపోయిన ముంపు గ్రామంగా ప్రకటించలేదని తెలిపారు

అభివాదం చేస్తున్న నేతలు

జిఒ117ను రద్దు చేయాలి

సిపిఎస్ రద్దు చేసేవరకూ పోరాటం

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు మినహాయించాలి

ఫ్యాప్టో ఉమ్మడి జిల్లా సదస్సులో నేతల డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పాఠశాల విద్యావ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న జిఒ 117ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఫ్యాప్టో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సదస్సును ఏలూరు జిల్లా ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ జి.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఛైర్మన్ నారాయణ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సదస్సుకు ఫ్యాప్టో రాష్ట్ర నాయకులతోపాటు ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎల్.సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ నూతన విద్యావిధానం వల్ల వేలాది ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యాయన్నారు. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న వైఖరి దారుణంగా ఉందని, తక్షణం ఇలాంటి వైఖరి విడనాడాలని కోరారు. అలాగే బోధనేతర పనుల నుండి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, ఉద్యోగోన్నతులను రెగ్యులర్ ప్రాతిపదికన ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కో ఛైర్మన్ బి.మనోజ్ కుమార్ మాట్లాడుతూ నేడు ప్రకటించిన ఉపాధ్యాయ ఉద్యోగోన్నతులన్నీ కొత్తగా వచ్చినవి కాదని, ఎస్‌జిటి పోస్టులు రద్దు చేయడం ద్వారా పొందినవేనని పేర్కొన్నారు. సిపిఎస్ రద్దు చేయాలని, పిఆర్‌సి, ఇతర బకాయిలు వెంటనే విడుదల చేయాలని, చట్టబద్ధమైన 12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు 11వ పిఆర్‌సికి అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ ఫ్యాప్టో పోరాటం కొనసాగుతుందన్నారు.

రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ శ్రీనివాసరావు, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపిమూర్తి, ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సాల్మన్‌రాజు ఈ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ఎపిఎన్‌జిఒ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ రామారావు, సిఐటియు నాయకులు ఆర్.లింగరాజు, ఎఐటియుసి నాయకులు బండి వెంకటేశ్వరరావు, ఫ్యాప్టో పోరాటానికి మద్దతు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ జవహర్‌లాల్, జనరల్ సెక్రటరీ దామోదర్, తూర్పుగోదావరి జిల్లా సెక్రటరీ జనరల్ శేష బ్రహ్మం పాల్గొన్నారు.

వర్షానికి నీట మునిగిన వరి నారుమడులు

ఉంగుటూరు : మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో వరి నారుమడులు నీట మునిగాయి. మండలంలో మెట్ట, డెల్టా కింద 27 వేలకు పైగా ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. వందలాది ఎకరాల్లో నారుమడులు వేసుకున్నారు. లోతట్టు పొలాలు, పంట బోదెలు, మురుగు బోదెలు పూడుకుపోవడం తదితర కారణాలతో వరద నీరు దిగువకు వెళ్లే మార్గంలేక వర్షపు నీటిలోనే నారుమడులు మునిగి ఉన్నాయి. వరుసగా మూడురోజుల పాటు నీటి మునిగినన వరి కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి హామీ కూలీలకు వేతనాలు ఇవ్వాలి

ముసునూరు : ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు వెంటనే వేతనం విడుదల చేయాలని సిపిఎం జిల్లా నాయకులు జి.రాజు కోరారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల వారు ఆర్థికంగా బలోపేతం కావడానికి పార్లమెంట్‌లో సిపిఎం పోరాడి జాతీయ గ్రామీణ ఉపాధి హామి చట్టం తీసుకొచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. పనిని వంద రోజులుగా తగించిందన్నారు.వారం రోజుల్లో రోజువారి కూలీ వేతనం ఇవ్వాలని, లేకపోతే తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల వద్ద జులై మూడో తేదీన నిరసనలు, సమ్మెలు మండలంలోని 16 గ్రామాల కూలీలతో కలిసి చేస్తామని హెచ్చరించారు. అప్పటికి ఇవ్వకపోతే జిల్లా కార్యాలయాల వద్ద, సబ్ కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పిల్లి మురళి పాల్గొన్నారు.

బాధితుల ఖాతాల్లో వరద సాయం

కలెక్టరేట్ కార్యాలయం వివరణ - 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గతేడాది జూలై 2022 వరదలకు దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించిన పరిహారం బాధితుల ఖాతాల్లోకి జమచేసినట్లు కలెక్టర్ కార్యాలయ వివరణ ఇచ్చింది. 'నీళ్లలో ముంచారు.. సాయం మరిచారు' అంటూ ఈనెల 25వ తేదీన 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బాధితులందరికీ ఇంటి నష్టపరిహారం బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమచేసినట్లు తెలిపారు. దెబ్బతిన్న గుడిసెకు ఒక ఇంటికి రూ.పదివేలు చొప్పున వేలేరుపాడు మండల పరిధిలో 2093 ఇళ్లకు, కుక్కునూరు మండల పరిధిలోని 984 ఇళ్లకు నషపరిహారం ఇచ్చామన్నారు. మొత్తం రెండు మండలాల్లో 3077 ఇళ్లకు రూ.పది వేలు చొప్పున రూ.3,07,70,000 సొమ్ము ఇచ్చామని తెలిపారు. పూర్తిగా, తీవ్రంగా నష్టపోయిన కచ్చా, పక్కా ఇంటికి రూ.95,100 చొప్పున వేలేరుపాడు మండలంలో 611 ఇళ్లకు, కుక్కునూరు మండలంలో 517 ఇళ్లకు మొత్తం 1128 ఇళ్లకు రూ.10,72,72,800 సొమ్ము నేరుగా బాధితుల బ్యాంకు ఖాతాల్లో జమచేశామని వివరించారు. పాక్షికంగా దెబ్బతిన్న ఇంటికి రూ.3,200 చొప్పున వేలేరుపాడు మండలంలో 485 ఇళ్లకు, కుక్కునూరు మండలంలో 441 ఇళ్లకు మొత్తం 926 ఇళ్లకు రూ.29,63,200 సొమ్ము బాధితుల బ్యాంకు ఖాతాల్లో జమచేశామని తెలిపారు.

పాక్షికంగా దెబ్బతిన్న పక్కా ఇంటికి రూ.5,200 చొప్పున వేలేరుపాడు మండలంలో 211 ఇళ్లకు, కుక్కునూరు మండలంలో 310 ఇళ్లకు మొత్తం 521 ఇళ్లకు రూ.27,09,200 సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు పేర్కొన్నారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాలకు సంబంధించి ప్రభుత్వం నుండి ఇళ్లు దెబ్బతిన్న బాధితుల బ్యాంకు ఖాతాలకు నేరుగా రూ.14,37,15,200 జమచేసినట్లు తెలిపారు. పరిహారం అందించిన ఇళ్లకు సంబంధించిన లెక్కలను మాత్రమే అధికారులు ఇచ్చారు. అసలు దెబ్బతిన్న ఇళ్లు మొత్తం ఎన్ని అనే లెక్క మాత్రం ఇవ్వలేదు. దాదాపు ఎనిమిది వేల ఇళ్లు దెబ్బతిన్నట్లు అప్పట్లో ప్రకటించారు. ప్రస్తుతం అధికారులు ఇచ్చిన నష్టపరిహారం లెక్కల్లో మాత్రం 5,652 ఇళ్లకు సంబంధించిన వివరాలు మాత్రమే కనిపిస్తున్నాయి. దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించిన లెక్కలు గ్రామాల వారీగా ఇస్తే వాస్తవ పరిస్థితి స్పష్టంగా తెలిసే అవకాశం ఉంటుంది.

వడ్డీ లేకుండా పన్నుల చెల్లింపునకు అవకాశం

ఏలూరు టౌన్ : ఏలూరు నగర పాలక సంస్థకు 2023-24 మొదటి అర్థ సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు వడ్డీ లేకుండా ఈ నెల 30లోగా చెల్లించాలని నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అన్నారు. సెలవు దినాల్లో కూడా పన్ను చెల్లించేందుకు వీలుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సిపిఎం నేత ప్రభాకర్‌రావు మృతికి సంతాపం

ప్రజాశక్తి - చాట్రాయి

సిపిఎంలో కార్యకర్త నుంచి నాయకుడిగా ఎదిగి విస్సన్నపేట జెడ్‌పిటిసి సభ్యుడిగా గెలుపొందిన ప్రభాకర్‌రావు ఆదివారం మృతి చెందారు. గత 15 రోజుల క్రితం తిరువూరు మండలంలోని ఎర్రమాడు గ్రామంలో సమావేశంలో పాల్గొని రాత్రి సమయంలో తిరిగి వస్తూ ఉండగా ప్రమాదానికి గురై తలకు గాయం అవ్వటంతో గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందారు. తిరువూరు నియోజకవర్గంలో పార్టీలో అనేక బాధ్యతలు నిర్వహించి మంచి నాయకుడిగా గుర్తింపు పొందిన మద్దుకట్ల ప్రభాకర్‌రావు మృతి చెందడం పార్టీకి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. ఆయన మృతి చెందారన్న సమాచారాన్ని తెలుసుకున్న సిపిఎం చాట్రాయి మండల కార్యదర్శి కొలికపోగు భాస్కరరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మేడేపల్లి హేమలీమేరీ, సామాజిక చైతన్య వేదిక కన్వీనర్ ఐవి.శ్రీనివాసరావు, సభ్యులు చాగంటి రాజారావు తిరువూరులోని ప్రభాకరరావు గృహానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

'అక్రమ కేసులు బనాయించడం హేయం'

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఒఎస్‌సి యువతికి జరిగిన అన్యాయంపై పోరాడితే తమపై అక్రమంగా కేసులు బనాయించారని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు శేవా నాగమునేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముదినేపల్లిలోని తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని శ్రీహరిపురం శివారు వనంపూడిలో ప్రేమ పేరుతో దళిత యువతిని మోసం చేసిన ఘటనపై మూడేళ్ల క్రితం మాలమహానాడు, మాదిగ దండోరా ఆధ్వర్యంలో పోరాడితే తమపై అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. అప్పట్లో జరిగిన ఘటనను నిరసిస్తూ తాము బాధితురాలికి అండగా ఉండి పోరాటం చేశామన్నారు. ప్రభుత్వ పరంగా ఆమెకు న్యాయం జరిగిందని, అందుకు పోలీస్ ఉన్నతాధికారులను సైతం స్వయంగా వెళ్లి కలిసి వారిని అభినందించామని చెప్పారు. అయితే అప్పట్లో కొంత మంది నాయకుల ప్రోద్బలంతో బాధితురాలితో తమపై నిరాధార ఫిర్యాదులు చేయించి పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడంతో న్యాయస్థానం నుంచి విచారణ నోటీసులు తమకు అందాయని బాబూరావు తెలిపారు. తమపై అక్రమ కేసులు పెట్టిన ఎస్ఐ మణికుమార్‌పై చర్యలు తీసుకునే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. ఎస్ఐ మణికుమార్ వైఖరిపై తాము సోమవారం జిల్లా ఎస్‌పిని కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర మాదిగ దండోరా ఉపాధ్యక్షులు ఏసుపోగు దానియేలు, జిల్లా మాలమహానాడు మహిళా అధ్యక్షురాలు బీబీ లావణ్య, మండల మాలమహానాడు మహిళా అధ్యక్షురాలు దాసరి మణి పాల్గొన్నారు.

వర్షపు నీరు మళ్లింపు

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు రైల్వే అండర్ పాస్ దారిలో వర్షపు నీరు చేరింది. చేబ్రోలుకు చెందిన బూరుగుపల్లి ఆంజనేయులు నాలుగు నెలల క్రితం సొంత నిధులతో అండర్‌పాస్ దారిలో సీసీ రోడ్డును నిర్మించి అందరి మన్ననలు పొందారు. ఆ దారిలో వర్షం నీరు నిలిచిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో ఆయిల్ ఇంజన్ సాయంతో నీటిని తోడిస్తున్నారు. రైలుగేటు వేసిన ఈ అండర్ పాస్ వల్ల కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనదారులు రాకపోకలు యథావిధిగా సాగించేందుకు ఉపయోగంగా ఉంది. వర్షపు నీటితో రాకపోకలకు ఇబ్బంది దృష్ట్యా దాతలు మళ్లీ స్పందించి నీటిని తోడిస్తున్నారు.

27న మాలల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఈ నెల 27వ తేదీన మంగళగిరిలో టిడిపి రాష్ట్ర కార్యాలయంలో జరిగే మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని టిడిపి ఎస్‌సి సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షులు యర్ర సుజీవరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో యర్ర సుజీవరావు మాట్లాడుతూ మాలల ఆత్మీయ సమ్మేళనంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

లోకేష్ యువగళంలో కొడాలి వినోద్

ప్రజాశక్తి - ముదినేపల్లి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో టిడిపి కైకలూరు నియోజకవర్గ యువనేత కొడాలి వినోద్ పాల్గొన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన యువగళం పాదయాత్రలో లోకేష్‌ను కలిసిన వినోద్ ఆయనతో పాటు నడిచారు.

నేరాలు - ఘోరాలు

ఉత్తీర్ణత సాధించలేదని బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పదో తరగతి ఉత్తీర్ణత సాధించలేదని మనస్తాపంతో ఓ బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక బాబూజగ్జీవన్‌రామ్ పేటకు చెందిన వెంట్రపాటి వెన్నెల (17) 2022లో పదో తరగతి పరీక్షలు రాసింది. అప్పుడు సోషల్, లెక్కలు తప్పటంతో మళ్లీ ప్రయత్నించగా సోషల్‌లో ఉత్తీర్ణత పొంది లెక్కలు తప్పింది. అనంతరం జరిగిన పరీక్షల్లో ప్రయత్నించి విఫలం చెందింది. ఈ సారి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు ఈ నెల 23న వచ్చాయి. మళ్లీ లెక్కలు తప్పటంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఆదివారం తల్లిదండ్రులు, తమ్ముడు గుడికి వెళ్లగా వెన్నెల కొంత నీరసంగా ఉందని రాలేనని ఇంటి వద్దే ఉంది. ఈ క్రమంలోనే ఆమె ఇంట్లో దూలానికి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాసేపటికి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు విషయం తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించడంతో రూరల్ ఎస్ఐ లక్ష్మణ్‌బాబు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అదృశ్యమైన బాలిక ఆచూకీ గుర్తింపు

యువకుడు అరెస్టు

ప్రజాశక్తి - మండవల్లి

అదృశ్యమైన బాలిక ఆచూకీని పోలీసులు కనిపెట్టి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలికను మాయమాటలు చెప్పి తీసుకెళ్లిపోయిన వ్యక్తిని, అతనికి సహకరించినవారిని కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెరికేగూడెం గ్రామానికి చెందిన బాలిక కనిపించడం లేదని ఈ నెల 12న తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ రామకృష్ణ బాలిక అదృశ్యంపై విచారణ చేపట్టారు. బాలికను బావ వరసైన ఏలూరు జిల్లా పెదపాడు మండలానికి చెందిన బి.సత్యప్రసాద్ తీసుకెళ్లినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని తెలిపారు. అతని ఆచూకీ కోసం ప్రయత్నించగా ఎటువంటి సమాచారం తెలియలేదన్నారు. దీంతో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి బాలిక ఆచూకీ కనిపెట్టినట్లు చెప్పారు. దుర్గాప్రసాద్ బాలికను తీసుకెళ్లేందుకు పక్కా ప్లాన్ చేసుకున్నాడు. పెరికేగూడెం నుంచి దుర్గాప్రసాద్ స్నేహితుడు తన వాహనంపై బాలికను ఇంటి నుంచి వేరే గ్రామానికి తీసుకువెళ్లాడు. అక్కడ నుంచి బాలికను కారులో ఎక్కించుకుని రాజమండ్రి తీసుకెళ్లి అక్కడ ఒక వారం రోజులు ఉన్నారు. పోలీసులు వెతుకుతున్నారని దుర్గాప్రసాద్‌కు తెలియడంతో అక్కడ నుంచి విశాఖపట్నం, అక్కడ నుంచి నెల్లూరు తీసుకెళ్లాడు. పోలీసులు కూడా నెల్లూరు చేరుకున్నారని తెలుసుకున్న దుర్గాప్రసాద్ బాలికను తిరుపతికి తీసుకెళ్లాడు. అక్కడ నుండి బస్సులో హైదరాబాద్ తీసుకెళ్లాడన్నారు. పక్కా సమాచారంతో పోలీసులు ఆ బస్సును ఫాలో అయి హైదరాబాద్ బస్టాండ్‌లో దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనితో పాటు బాలికను ఆదివారం మండవల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. బాలికను మాయమాటలు చెప్పి తీసుకెళ్లిపోయిన దుర్గాప్రసాద్‌ను, అతనికి సహకరించిన వ్యక్తులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు. బాలిక అదృశ్యం కేసులో ఎంతో చాకచక్యంగా వ్యవహరించి ఆచూకీ కనిపెట్టి తల్లిదండ్రులకు అప్పగించినందుకు గ్రామస్తులు, బాలిక తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

టి.నరసాపురం : పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఐదుగురు జూదరులను అరెస్టు చేశారు. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని హైదరాబాద్ తండా శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ సతీష్‌కుమార్ తన సిబ్బందితో దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3400 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

డ్రెయిన్ల నిర్మాణం.. అస్తవ్యస్తం..!

అసంపూర్తిగా పనులు
ప్రమాదాల బారిన ప్రజలు
పట్టించుకోని ఎన్‌హెచ్ అధికారులు



సెంటర్‌లో అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీ నిర్మాణం

ప్రజాశక్తి - ముదినేపల్లి

పామర్రు-దిగమర్రు ఎన్‌హెచ్-165 రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మండల కేంద్రమైన ముదినేపల్లి సెంటర్‌లో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా మారాయి. సదరు కాంట్రాక్టర్ సెంటర్‌లో డ్రెయినేజీ నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో చేయకుండా మధ్యలో ఆపి అసంపూర్తిగా నిలిపివేశాడు. దీంతో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి ప్రజల పాలిట ప్రాణసంకటంగా తయారైంది. గత నవంబర్ మూడో తేదీన ముదినేపల్లి సెంటర్‌లో డ్రెయినేజీ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ ముదినేపల్లిలోని అంబేద్కర్ కాలనీ నుంచి కైకలూరు రోడ్డులోని రంగాపురం వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టాడు. ఇందులో భాగంగా ముదినేపల్లి సెంటర్‌లో తొలుత డ్రెయినేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి పనులు మొదలుపెట్టాడు. కొన్నిరోజుల పాటు పనులు చేసి మధ్యలో నిలిపివేశాడు. దీంతో డ్రెయినేజీ నిర్మాణ పనులు ఎక్కడ పనులు అక్కడే అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు ప్రమాదాలకు గురై తీవ్ర అవస్థలు పడుతున్నారు.

అగ్రవర్ణాల దుకాణాల ముందే డ్రెయినేజీ నిర్మాణాలు

గ్రామ ప్రధాన సెంటర్‌లో సుమారు 600 మీటర్ల పొడవునా డ్రెయినేజీ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ 600 వందల మీటర్లు అగ్రవర్ణాలకు చెందిన దుకాణాల ముందు మాత్రమే డ్రెయినేజీ నిర్మించినట్లుగా గ్రామస్తులు చెబుతున్నారు. ఎస్‌సిలకు, బిసిలకు చెందిన దుకాణాల ముందు గాని, వారి ఇళ్ల ఎదుట గాని డ్రెయినేజీ నిర్మాణాలు జరగలేదు. కేవలం అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తుల దుకాణాలు ముందే పనులు చేపట్టి పూర్తి చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్‌సిలు, బిసిలకు చెందిన దుకాణాల ముందు డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై ఆయా వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమౌతోంది. కేవలం అగ్రవర్ణాలకు చెందిన దుకాణాలు ముందు నిర్మాణ పనులు పూర్తి చేయడంతో తమ దుకాణాలకు మరమ్మతులు చేపట్టి తిరిగి అగ్రవర్ణాలు వారి దుకాణాలను అద్దెలకు ఇచ్చుకున్నారంటూ ఎస్‌సి, బిసిలకు చెందిన దుకాణదారులు ఆరోపిస్తున్నారు.

8 నెలల్లో పని చేసింది 20 రోజులే

ముదినేపల్లి సెంటర్‌లో డ్రెయినేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి ఎనిమిది నెలలు కాగా, పని చేసింది కేవలం 20 రోజులేనని గ్రామస్తులు చెబుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణితో, అలసత్వం వహించడంతో పనులు శరవేగంగా ముందుకు సాగలేదని స్థానికులు చెబుతున్నారు.

ముక్కలు, ముక్కలుగా నిర్మాణ పనులు

కాంట్రాక్టర్ డ్రెయినేజీ నిర్మాణ పనులు ముక్కలు ముక్కలుగా కడుతున్నాడు. ఏ వైపు నిర్మాణ పనులు పూర్తిగా చేయడం లేదు. సగం, సగం పనులు చేస్తూ మధ్యలో నిలిపివేస్తూ మళ్లీ కొంతకాలానికి మొదలుపెడుతూ కాలయాపన చేస్తున్నాడు. దీంతో నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.

దుకాణాల ముందు అసంపూర్తిగా డ్రెయినేజీ పనులు

పాత డ్రెయిన్లు బంద్

గ్రామంలోని మురుగునీరు పోయేందుకు ఉత్తర, దక్షిణ వైపు రెండు పాత డ్రెయిన్లు ఉన్నాయి. గ్రామంలోని మురుగు, వర్షపు నీరంతా ఈ డ్రెయిన్ల ద్వారా పోల్‌రాజ్ మేజర్ డ్రెయిన్‌లో కలుస్తాయి. కాంట్రాక్టర్ కొత్త డ్రెయినేజీ నిర్మాణాల పేరుతో గతంలో ఉన్న రెండు పాత డ్రెయిన్లను పూర్తిగా బండరాళ్లతో పూడ్చి వేశాడు. దీంతో గ్రామంలోని మురుగునీరు, వర్షపు నీరంతా బయటకు వెళ్లే అవకాశం లేక బంద్ అయింది. దీంతో రోడ్లపైనే రోజులు తరబడి వర్షపునీరు, మురుగు నిలిచిపోయి గ్రామం ముంపు భారిన పడుతోంది. దీంతో గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. ఉత్తరం వైపు ఉన్న డ్రెయిన్ పూర్తిగా బంద్ కాగా, దక్షిణ వైపు ఉన్న డ్రెయిన్ ద్వారా కొద్దిగా మురుగునీరు బయటకు వెళ్తుంది. భారీ వర్షం కురిస్తే మోకాల లోతు నీటిలో గ్రామంలోని అన్నీ రోడ్లు మునిగిపోతాయి. దీంతో గ్రామస్తులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

ప్రలోభాలకు లోనై...

అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు తమ దుకాణాల ముందు త్వరితగతిన డ్రెయినేజీ నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేసేందుకు ఎన్‌హెచ్ అధికారులను, కాంట్రాక్టర్‌ను ప్రలోభాలకు గురి చేసినట్లు పుకార్లు వినవస్తున్నాయి. ఎంచుకున్న కొంతమంది వ్యక్తుల దుకాణాలు ముందు మాత్రం డ్రెయినేజీ నిర్మాణ పనులు పూర్తి చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. బడాబాబుల నుంచి సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు ముడుపులు అందడంతో వారి దుకాణాల వద్ద మొదట నిర్మాణ పనులు కడుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. అంతేకాక ఎన్‌హెచ్ అధికారులు బడాబాబుల భూములకు ఇతర వర్గాల కన్నా ఎక్కువ నష్టపరిహారం ఇచ్చారనే ఆరోపణాలు వెల్లువెత్తుతున్నాయి.

ఇబ్బందుల్లో ప్రజలు

అసలే వర్షాలు ఆపై రోడ్లన్నీ గుంతలమయం, దీనికి తోడు అస్తవ్యస్తంగా, అసంపూర్తిగా డ్రెయిన్ల నిర్మాణంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురుస్తున్నందున అసంపూర్తిగా ఉన్న డ్రెయిన్ల గుంతల్లోకి, రోడ్లపై ఏర్పడ్డ గుంతల్లోకి నీరు చేరి నిలిచిపోవడంతో ఎక్కడ రోడ్డు, ఎక్కడ గుంతో, ఎక్కడ ఆగాధమో తెలియక ప్రజలు, ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి క్షతగాత్రులుగా మారుతున్నారు.

బేరాలు లేక వ్యాపారుల అవస్థలు

దుకాణాల ముందు డ్రెయినేజీ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు రాక, బేరాలు లేక వ్యాపారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వస్త్ర వ్యాపారులు, వివిధ రకాల దుకాణాలు బేరాలు లేక వెలవెలబోయి ఇక్కట్లు పడుతున్నారు.

పట్టించుకోని పంచాయతీ విజ్ఞప్తులు

నేషనల్ హైవే అధికారులు, కాంట్రాక్టర్ గ్రామ పంచాయతీ సర్పంచి, పంచాయతీ కార్యదర్శి చేస్తున్న విజ్ఞప్తులను అసలు పట్టించుకోవడంలేదు. వారి విన్నపాలు ఆలకించడంలేదు. వారి సూచనలు, సలహాలు ఏ మాత్రం తీసుకోవడంలేదు. గ్రామస్తులు పడుతున్న వెతల గురించి సర్పంచి చెప్పినా వారి మాటలు ఎన్‌హెచ్ అధికారులు, కాంట్రాక్టర్ ఖాతర్ చేయడంలేదు. గ్రామ సర్పంచిని సంప్రదించకుండా వారి ఇష్టానుసారంగా, అడ్డదిడ్డంగా పనులు చేస్తూ డ్రెయినేజీ నిర్మాణాలు చేపడుతున్నారు.

స్టేట్ బ్యాంకు వద్ద తవ్విన గుంతలో మురుగునీరు

దుర్గంధం వెదజల్లుతోంది

స్థానిక ఎస్‌బిఐ, బస్టాండ్, పెట్రోల్ బంకు తదితర ప్రాంతాల్లో నిర్మాణ పనుల కోసం గుంతలు తవ్వి అసంపూర్తిగా వదిలేశారు. ఈ డ్రెయినేజీ గుంతల్లో నీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. నెలల తరబడి మురుగు నీరు బయటకు వెళ్లే అవకాశం లేక నిల్వ ఉండి బయటకు పారుదల లేకపోవడంతో దుర్వాసన వస్తోంది. దీంతో బ్యాంకుకు వెళ్లే వినియోగదారులు, బస్టాండ్‌కు వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులు, పెట్రోల్ బంకుకు వెళ్లే వాహనదారులు, దుకాణాలకు వెళ్లే కొనుగోలుదారులు ముక్కులు మూసుకుని వెళ్లే దుస్థితి నెలకొంది. ఎనిమిది నెలల కాలానికి 600 మీటర్ల డ్రెయినేజీ మాత్రమే నిర్మిస్తే, సెంటర్ అంతా నిర్మించేవరకు ఇంకా ఎన్ని ఏళ్లు సమయం పడుతుందోననే ఆందోళన జనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి ముదినేపల్లి సెంటర్‌లో డ్రెయినేజీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలు పడుతున్న వెతలు, పాట్లు తీర్చాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం

డిఇ సత్యనారాయణ

ముదినేపల్లి సెంటర్‌లో డ్రెయినేజీ నిర్మాణ పనులు వెంటనే మొదలుపెట్టాలని కాంట్రాక్టర్‌కు ఇప్పటికే నాలుగు సార్లు నోటీసులు జారీ చేశాం. రెండురోజుల్లో తిరిగి పనులు ప్రారంభిస్తాం. కూలీలు తక్కువగా ఉన్నారు. సోమవారానికి 40 మంది కూలీలు వస్తారు. అగ్రవర్ణాల వ్యక్తుల దుకాణాలు ముందు మొదట డ్రెయినేజీ నిర్మాణ పనులు పూర్తి చేశామనడం సరికాదు. లైన్‌లో డ్రెయినేజీ కట్టుకుంటూ వస్తే అలా వచ్చింది అంతే.. అది నిజం కాదు. అంటూపైఆరోపణాలు అన్నీ కొట్టి పారేశారు.

ఊపందుకున్న వరిసాగు పనులు

62 శాతం నారుమళ్లు పూర్తి

ప్రజాశక్తి - భీమడోలు

తొలకరి పలకరింపుతో భీమడోలు మండలంలో వరి సాగు కార్యక్రమం ముమ్మరమైంది. ఇప్పటివరకు వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయానికి సిద్ధమైన రైతులు తొలకరి వానలు ప్రారంభం కాగానే వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటివరకు నారుమళ్లను వేసిన రైతులు ఎండిపోతున్న పైరుకు తొలకరి వానలు ఊపిరి పోశాయని అంటున్నారు. మండలంలో మే నెలలో గత సంవత్సరం 59.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా ప్రస్తుతం 36 మిల్లీమీటర్లు నమోదైంది. జూన్ నెలలో గత సంవత్సరం 107.3 మిల్లీమీటర్లు నమోదు కాగా రెండురోజుల క్రితం వరకు 4.40 మిల్లీమీటర్ల, ఆ తరువాత గత రెండు రోజులుగా వరుసగా ఒక మిల్లీమీటర్, రెండు మిల్లీమీటర్ నమోదు కావడంతో రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. దీనికి అదనంగా ఈ నెల ఒకటో తేదీన గోదావరి కాలువకు నీరు విడుదల కావడం, 5, 6 తేదీల్లో శివారు ప్రాంతాలకు చేరటం, ఆ తరువాత ఎండలు కారణంగా నారుమళ్లను వేయటం ఆలస్యం కావడంతో కాలువలో నీరు రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. వీటన్నింటి నేపథ్యంలో మండలంలో నారుమళ్లను పోయటం వేగవంతమైంది. మండల వ్యవసాయ ప్రణాళిక మేరకు మండలంలో 13,250 ఎకరాల్లో వరిసాగు జరగాల్సి ఉంది. దీనికి సుమారు 700 ఎకరాల విస్తీర్ణంలో నారుమళ్లను వేయాల్సి ఉంది. ప్రభుత్వం రైతులకు విత్తనాలకు ఇచ్చే కొనుగోలు రాయితీని తగ్గించి కేజీకి రూ.5 మాత్రమే ఇవ్వటంతో రైతులు విత్తనాల కోసం విత్తన మార్పిడి విధానంపై ఆధారపడ్డారు. ఫలితంగా మండలంలో 430 ఎకరాల్లో అంటే 62 శాతం నారుమళ్లు పూర్తయ్యాయి. ఈ నెలాఖరుకు నారుమళ్లను వేసే కార్యక్రమం నూరు శాతం పూర్తవుతుందని వ్యవసాయ అధికారులు అంటున్నారు. నారుమళ్లను వేసే కార్యక్రమం ఆలస్యం కావడంతో సాగు చివరి కాలంలో దీని ప్రభావం వ్యవసాయ ప్రణాళికపై పడే అవకాశం ఉందని రైతులు అభిప్రాయ పడుతున్నారు. ఆదివారం వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు పి.ఉషారాజకుమారి, వ్యవసాయ అధికారి ఉషారాణి మండలంలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో వారు మాట్లాడారు. నారుమళ్లలో నీరు నిల్వ ఉంటే వాటిని తొలగించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన నారుమడి కోసం ఐదు సెంటీమీటర్లు విస్తీర్ణంలో గల నారుమడి కోసం రెండు కేజీల నత్రజని, ఒక కేజీ భాస్వరం, ఒక కేజీ పొటాష్ వాడాలని సూచించారు.

రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు

ఎపి అకాడమీ ప్రారంభం

చింతలపూడి : నిరుద్యోగుల కలను సాకారం చేసుకోవడానికి ఎపి అకాడమీ ఎంతగానో దోహదపడుతుందని చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. పట్టణంలోని గంట వారి వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎపి అకాడమీని ఆదివారం ఆమె ప్రారంభించారు. కరస్పాండెంట్ ఆర్‌పి రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ములుగుమాటి నీరజసుధాకర్ మాట్లాడుతూ రూరల్ ఏరియాలో పేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో శిక్షణ అందించాలని ఆమె కోరారు. నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందంతో నాణ్యమైన విద్య అందించనున్నట్లు కరస్పాండెంట్ ఆర్‌పి రెడ్డి చెప్పారు. అనంతరం విద్యార్థులకు మోడల్ టెస్ట్, క్లాసులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డాక్టర్ రాంబాబు, డైరెక్టర్ ఆర్.సుజాత, ప్రిన్సిపల్ ప్రేమ నీలిమ, ఆర్గనైజర్ గొందిరాజు, కోర్స్ డైరెక్టర్ వి.కరుణకర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంఘం జిల్లా కోశాధికారిగా మూర్తి

ప్రజాశక్తి - భీమడోలు

ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా శాఖ కోశాధికారిగా భీమడోలుకు చెందిన పివిఆర్.మూర్తి ఎన్నికయ్యారు. ఏలూరులో జిల్లా శాఖ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికల్లో పివిఆర్.మూర్తి కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుతం భీమడోలు తాలూకా సంక్షేమ సంఘం సమన్వయకర్తగా పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా భీమడోలుకు చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్లు రంగారావు, బ్రహ్మారావు, డేవిడ్, నాగరాజుతో పాటు భీమడోలు శాఖ అధ్యక్షులు శ్రీరామ్‌ను ఏలూరు జిల్లా శాఖ సన్మానించింది. అనంతరం జరిగిన మరొక కార్యక్రమంలో భీమడోలుకు చెందిన సన్మాన గ్రహీతలు జిల్లా శాఖ కోశాధికారిగా ఎన్నికైన పివిఆర్.మూర్తిని సత్కరించారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

జ్యూట్‌మిల్లు కార్మిక సంఘాలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జ్యూట్‌మిల్లు కార్మికులకు తీరని ద్రోహం తలపెట్టిన ఐఎఫ్‌టియు తప్పుడు ప్రచారం మానుకోవాలని జ్యూట్ మిల్లు కార్మిక సంఘాలు హెచ్చరించాయి. ఆదివారం స్థానిక ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టిఎన్‌టియుసి, జ్యూట్‌మిల్లు యూనియన్ అధ్యక్షులు కోలాపల్లి ఉమాశంకర్(బుజ్జి) మాట్లాడుతూ 16 నెలల క్రితం జ్యూట్ మిల్లు నష్టాలు వస్తున్నాయనే సాకు చూపి మిల్లును అకారణంగా మూసివేశారని విమర్శించారు. అప్పట్లో జ్యూట్ మిల్లులోని ఆరు కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించి ధర్నాలు, రాస్తారోకో, వంటావార్పులతో పాటు వివిధ రూపాల్లో ఉద్యమాలు నిర్వహించాయని తెలిపారు. క్లాజ్ 19 అడ్డం పెట్టుకుని యాజమాన్యం ఏలూరు జ్యూట్‌మిల్లులో పని చేస్తున్న 900 కార్మికులను కొత్తూరు జ్యూట్‌మిల్లుకు బదిలీ చేసిందని విమర్శించారు. ఈ నెల 22న అన్ని జ్యూట్‌కార్మిక సంఘాల సమక్షంలో జెసి ఎల్ ఆధ్వర్యంలో యాజమాన్యంతో ఒప్పందం కుదిరితే ఐఎఫ్‌టియు మాత్రం తప్పుడు ప్రచారాలతో తామే కార్మికులకు న్యాయం చేసినట్లుగా గొప్పలకు పోతుందని ఎద్దేవా చేశారు. తొలి నుంచి జ్యూట్ మిల్లు యాజమాన్య వైఖరికి వ్యతిరేకంగా కార్మిక సంఘాల తరపున వెన్నుదన్నుగా ఉండి జ్యూట్ మిల్లు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఇతోధికంగా సహకారం, తోడ్పాటు అందించిన బడేటి చంటికి ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఎఐటియుసి జిల్లా కన్వీనర్, జ్యూట్ లేబర్ యూనియన్ అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల పక్షాన పోరాడి సాధించినట్లుగా ఐఎఫ్‌టియు తప్పుడు ప్రచారం చేసుకుంటుందని, గతంలో కార్మికులకు రూ.4,500 నష్టపరిహారం, నాలుగు నెలల జీతం డిమాండ్ చేసిన ఐఎఫ్‌టియు యాజమాన్య వైఖరికి ఎందుకు తలొగ్గిందని ప్రశ్నించారు. తెర వెనుక జరిగిన రాజకీయాన్ని త్వరలోనే బహిర్గతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు పట్టణ అధ్యక్షులు, జ్యూట్‌మిల్లు యూనియన్ అధ్యక్షులు బుగతా జగన్నాధం మాట్లాడుతూ గత 16 నెలల క్రితం ఏలూరు జ్యూట్‌మిల్లు మూసివేసి 1600 మంది కార్మికుల జీవితాలను చిన్నాభిన్నం చేశారని విమర్శించారు. ఉద్యమానికి సహకరించిన టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి చంటికి, జనసేన ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడుకు, సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ ఇతర పార్టీలకు ప్రజా సంఘాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

లారీని ఢీకొన్న కారు

బాలిక మృతి, ఆరుగురికి గాయాలు

ద్వారకాతిరుమల దర్శనానికి వెళ్లొస్తూ ప్రమాదం

ఏలూరు స్పోర్ట్స్: దైవదర్శనం నుంచి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురైన కుటుంబం ఓ చిన్నారిని కోల్పోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా ఉయ్యూరుకు చెందిన సిస్టా శ్రీనివాససుబ్రహ్మణ్య సమీరకుమార్ అదే గ్రామంలో కెనరా బ్యాంకులో మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఆయన భార్య పద్మావతి, కుమారుడు శ్రీకృష్ణ, తల్లి సీతాకుమారి, చెల్లెలు వందన, చెల్లెలి కుమార్తెలు ప్రజ్ఞ, సీతాఅలివేలి ప్రణతిలు కలిసి కారులో ఆదివారం ద్వారకాతిరుమల వెళ్లారు. దైవదర్శనం అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. కారును సమీర్ కుమారే నడుపుతున్నారు. ఈ క్రమంలో ఏలూరు సమీపంలోకి రాగానే జాతీయ రహదారిపై చొదిమెళ్ల వంతెన ఎక్కుతుండగా ముందు వెళ్తున్న లారీని ఎడమ వైపు నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. అందులో ప్రయాణిస్తున్న ఏడుగురూ గాయాలపాలయ్యారు. స్పందించిన హైవే అంబులెన్సు పోలీసులు క్షతగాత్రులను ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చిన్నారి ప్రణతి (5) మృతి చెందినట్లు తెలిపారు. మిగిలిన వారికి తీవ్రగాయాలు కాగా వైద్యులు చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న ఎస్‌పి మేరి ప్రశాంతి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వన్‌టౌన్ సిఐ బోణం ఆదిప్రసాద్, ఎస్ఐ లక్ష్మణ్‌బాబు ఆసుపత్రికి వచ్చి క్షతగాత్రుల పరిస్థితి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స కోసం బాధితులను విజయవాడ తరలించారు.

ఇద్దరు నకిలీ పోలీసుల అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు జాతీయ రహదారిపై మోటార్ సైకిళ్లపై ప్రయాణించే వారిని బెదిరించి వారి వద్ద నుంచి నగదు, నగలు దోచుకెళ్తున్న ఇద్దరు నకిలీ పోలీసులను ఏలూరు రూరల్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఏలూరు రూరల్ స్టేషన్‌లో ఆదివారం ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఏలూరు జాతీయ రహదారి నెంబర్ 16పై ఇద్దరు వ్యక్తులు పోలీస్ యూనిఫామ్ వేసుకుని మోటార్‌సైకిళ్లపై ప్రయాణించేవారిని అడ్డగించి, బెదిరించి డబ్బులు దండుకుంటున్నారనే ఫిర్యాదుతో పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ నెల 23వ తేదీ రాత్రి సమయంలో ఏలూరు బీడీ కాలనీకి చెందిన మౌలానా అనే వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వెళ్తున్నాడు. ఇదే సమయంలో ఏలూరు రూరల్ పరిధిలోని జాతీయ రహదారిపై ఒకరు పోలీస్ ఎస్ఐ యూనిఫామ్ ధరించాడు. ఇంకో వ్యక్తి పోలీసులమని చెబుతూ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఏలూరులోని పోలీసు అధికారులు తమకు తెలుసని, మీరు ఎవరని మౌలానా ప్రశ్నించటంతో వారు చాకు తీసి బెదిరించి అతని వద్ద డబ్బులు తీసుకెళ్లారు. దీనిపై అతను ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు ఆదేశాలతో ఏలూరు వన్‌టౌన్ సిఐ ఆదిప్రసాద్ పర్యవేక్షణలో రూరల్ ఎస్ఐ లక్ష్మణ్‌బాబు, సిబ్బంది బృందంగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఏలూరు శివారు ఆశ్రం హాస్పిటల్ సెంటర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కన రాజమండ్రి వైపు వెళ్లే సర్వీసు రోడ్డులో నకిలీ పోలీసులను అదుపులోకి తీసుకున్నారు.

కార్మికులకు సంఘీభావంగా టిడిపి, జనసేన, పట్టణ ప్రజానీకం నిలబడ్డారని దాని ఫలితంగా ఈ నెల 22న కార్మికుల కోరిక మేరకు ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. ఐఎఫ్‌టియు క్లాజ్ 19 మీద సంతకం పెట్టిన కారణంగానే ఏలూరులో పనిచేస్తున్న జ్యూట్ మిల్లు కార్మికులు కొత్తూరు జ్యూట్ మిల్లుకు బదిలీ చేయబడ్డారని విమర్శించారు. ఐఎఫ్‌టియు కారణంగానే కార్మికులు రోడ్డున పడ్డారని విమర్శించారు. ఈ సమావేశంలో జ్యూట్ లేబర్ యూనియన్ కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఎఐటియుసి నాయకులు పుప్పాల కన్నబాబు, టిఎన్‌టియుసి, జ్యూట్‌మిల్ యూనియన్ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి వి.సాయిబాబా పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు వాసవి, వనితా, యువతరంగ్ క్లబ్‌ల ఆధ్వర్యంలో వాయుసేన మాజీ సైనికుడు సంక జగదీష్ దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో వివిధ కమిటీల సభ్యుల ఆధ్వర్యంలో విలువైన నిత్యావసర సరుకులు, ఓ రైతుకు అవసరమైన మందుల పిచికారీ యంత్రం, పదిమంది నిరుపేదలకు చీరలు, వాసవి అమ్మవారి దేవాలయానికి 11 కుర్చీలు, లలితా కామేశ్వరి ఆలయానికి రెండు సిమెంట్ బెంచీలు అందించినట్లు వాసవి క్లబ్ జిల్లా సమన్వయకర్త చిన్నం శ్రీనివాసరావు తెలిపారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని మర్రిబంధం గ్రామంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎంపియుపి పాఠశాలలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ఆదివారం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఆర్‌బికెల్లో పిఎం కిసాన్ ఇ-కెవైసి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని అన్ని గ్రామాల్లో ఆర్‌బికె కేంద్రాల్లో పిఎం కిసాన్‌కు సంబంధించిన ఇ-కెవైసి చేస్తున్నట్లు ఎఒ చాముండేశ్వరి తెలిపారు. ముక్కొల్లుపాడు ఆర్‌బికెలో రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మలేరియా నివారణపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని దిగవల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో దోమల నివారణ ద్వారా మలేరియా బారిన పడకుండా ఉండవచ్చని నూజివీడు సబ్ యూనిట్ అధికారి ఎం.యలమంద తెలిపారు. మండలంలోని దిగవల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మలేరియా నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యలమంద మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి దిగవల్లి ఆసుపత్రి డాక్టర్ ఎం.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ రెండవ అదనపు జిల్లా జడ్జి, ఏలూరు వారి కోర్టులో

A.S. No. 128/2018

బిట్వీన్:

అయ్యగారి శాంతి కామేశ్వరి **-అప్పిలెంటు**

మరియు

తల్లాప్రగడ విశ్వనాధం మరియు వగైరాలు **-రెస్పాండెంట్లు**

పై నెంబరు గ్రంధమును అప్పిలెంటు, రెస్పాండెంట్లు పై ది. 25-6-2018వ తేదీన ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి, తాడేపల్లిగూడెం వారు O.S. No. 192/2005 జడ్జిమెంటు డిక్రీని Set avide చేయమని పై కోర్టులో దాఖలు చేసియున్నారు. దానిపై 7వ రెస్పాండెంటు అయిన

R-7: గాలి లక్ష్మి, W/o. సన్యాసిరావు,
D.No. 4-68-3A/16, మామిడి తోట,
ఇందిరా నగర్, 11వ వార్డు, తాడేపల్లిగూడెం,
పశ్చిమగోదావరి జిల్లా అను వారికి

ఏవిధమైన అభ్యంతరములు ఉన్న ఎడల **ది. 04-7-2023వ తేదీన ఉదయము 10 గంటల 30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియజేసుకొనవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానించబడును.

వెలగపూడి వేంకటేశ్వరరావు

ఏలూరు — న్యాయవాది, ఏలూరు

తేది. 27-6-2023 — సెల్: 9849669124